క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం



ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత వాసుదేవరావు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మ వారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన గెంబలి వాసుదేవరావు, సుజాత కుటుంబ సభ్యులు రూ.1,00,116 ఆర్థిక సహాయం చేశారు. సోమవారం వారి నివాసం వద్ద ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆది బాబు, ఎస్.వి. జి.శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దిలీప్‌కుమార్ ధనూకా, గొల్లస్వామికి నగదు అందజేశారు.

దాశరథి జయంతి వేడుకలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం నేతృత్వంలో కవి దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకల ను సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు, అధ్యాపకులు దాశరథి చిత్రపటం వద్ద పుష్పాలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ దాశరథి అగ్నిధార, తిమిరంతో సమరం, వంటి రచనలతో తెలంగాణ రజాకార్లకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగరేసి తెలంగాణ ప్రజల్ని చైతన్యపరిచిన కవి అన్నారు. తెలుగుశాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఆర్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ దాశరథి తెలుగు సాహితీలోకం మెచ్చిన మహాకవి అన్నారు. కార్య క్రమానికి హాజరైన డాక్టర్ వి.సుధీర్, పి.భాస్కర్, షేక్ వలీఖాన్, హేమ తదితరులు దాశరథి తెలుగు భాషకు చేసిన సాహితీ కృషిని కొనియాడారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



రమాదేవిని సన్మానిస్తున్న గ్రామపెద్దలు వేణుగోపాలరావు,తదితరులు

మెరకముడిదాం: మైసూర్‌లోని అవదూత దత్తపీఠం వారు భాగవతంలో శ్లోకాలపై ఇటీవల ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మండలంలోని గర్భాం గ్రామానికి చెందిన నడిపిల్లి రమాదేవి ఉత్తమశ్రేణి విజేతగా నిలిచి అవదూత దత్తపీఠం వ్యవస్థాప కులు గణపతి సద్గురు సచ్చిదానందస్వామి చేతుల మీదుగా మైసూర్‌లో అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా ఆమెను గ్రామానికి చెందిన తాడ్డి వేణుగోపాలరావు, వజ్రపు గంగరాజు, తాడ్డి శ్రీధర్, సిద్ధాంతి శ్రీనివాస రావు సోమవారం ఘనంగా సత్కరించా రు. గ్రామస్తులు రమాదేవిని అభినందించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియో థెరపిస్ట్ మనోజ్‌కుమార్

గజపతినగరం: మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రత్యేక అవసరాల పిల్లలకు స్థానిక భవిత కేంద్రంలో ఫిజియో థెరపిస్ట్ మనోజ్ కుమార్ సోమవారం ఫిజియోథెరపీ సేవలందించారు. ఈసందర్భంగా ఫిజియోథెరపిస్ట్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ప్రతీ సోమవారం భవితా కేంద్రానికి తీసుకువచ్చి ఫిజియోథెరపీ చేయించాలని సూచించారు. క్రమపద్ధతిలో ఫిజియోథెరపీ, వ్యాయామం చేయించడం వల్ల ప్రత్యేక అవసరాల పిల్లల్లో వైకల్యం తగ్గించవచ్చని, వారు సాధారణ పిల్లల మాదిరిగా కోలుకుంటారని చెప్పారు.

వరి నాట్లు ప్రారంభం



పాతశ్రీరంగరాజపురంలో వరినాట్లు వేస్తున్న మహిళలు

గజపతినగరం: అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఖరీఫ్ వరినాట్లు ప్రారంభించారు. పొలాల్లో చేరిన వరద నీటితో దమ్ములు చేసే పనుల్లో రైతన్నలు నిమగ్నమయ్యారు. పాతశ్రీరంగరాజపురం,కొత్తశ్రీరంగ రాజపురం, కాలంరాజు పేట, ఎం.వెంకటాపురం తదితర గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేసే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

పరిష్కారం లభించేనా....?

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలతో పాటు కూటమి అభ్యర్థులు స్థానిక సమస్యల పరిష్కారంపై చేసిన వాగ్దానాలు ఎప్పుడు నెరవేరుస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి నలభై రోజులు పూర్తయినా ఇంతవరకు ఏ ఒక్క హామీ నెరవేర్చిన, సమస్యలను పరిష్కరించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడంతో స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించి, వాటిని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- చీపురుపల్లి నియోజకవర్గంలో మూతబడిన ఫెర్రోపరిశ్రమలను తెరిపించాలని ప్రజల డిమాండ్
- తోటపల్లికుడి ప్రధాన కాలువ, ఇతర సమస్యల పరిష్కారంపై ఎదురు చూపు

చీపురుపల్లి: నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపించాలని ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని కిమిడి కళా వెంకటరావు హామీ ఇచ్చారు. ఆయన ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం ఏర్పడి నలభై రోజులు పూర్తయింది. ఎమ్మెల్యే ఇక్కడి సమస్యలపై దృష్టి సారిస్తారా, హామీలు ఏ మేరకు నెరవేరుస్తారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. మూతపడిన ఫెర్రో పరిశ్రమలు తెరిపించడం, తోటపల్లి కుడి ప్రధాన కాలువ మిగులు పనులు పూర్తి చేయడం వంటి అంశాలతో పాటు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక చర్చించి వాటికి పరిష్కారం మార్గంతో ఎమ్మెల్యే తిరిగి నియోజకవర్గానికి వస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



మూతపడిన ఆంధ్రా ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ

పరిశ్రమలు తెరుచుకుంటే వేలాది మందికి ఉపాధి



ఫెర్రో పరిశ్రమలు తెరుచుకుంటే వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. మా మండలంలో రెండు ఫెర్రో పరిశ్రమలు ఉన్నాయి. అందులో ఆంధ్రా ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ ఎనిమిది సంవత్సరాల క్రితమే మూతపడింది. మరొక ఫెర్రో పరిశ్రమ ఇటీవలలో మూతపడింది. ఈ రెండు పరిశ్రమల ద్వారా ప్రత్యక్షంగా 2 వేల కుటుంబాలు, పరోక్షంగా వెయ్యి కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. ఈ పరిశ్రమలకు ప్రభుత్వం విద్యుత్ రాయితీలతో పాటు ప్రోత్సాహకాలు ఇచ్చి తెరిపించి పేద కుటుంబాలకు ఉపాధి కల్పించాలి.

– సత్తారు శ్రీనివాసరావు, గర్భాం గ్రామం, మెరకముడిదాం మండలం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్.కోట నియోజకవర్గంలో పలు గ్రామాలకు మంజూరైన రోడ్ల పనులు
- చివరి దశలో నిలిచిపోయిన పనులు
- వేపాడ మండలంలో రూ.37 కోట్లతో ప్రారంభమైన సోంపురం – ఆనందపురం రహదారి విస్తరణ
- ఎన్నికలకు ముందే 90 శాతం పనులు పూర్తి
- పెండింగ్ పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు

శృంగవరపుకోట: తాము అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో సమస్యలన్నీ పరిష్కరించేస్తామని నేటి అధికారపక్ష నేతలు ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీల అమలుతో పాటు పెండింగ్ పనులు పూర్తి చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పలు గ్రామాలకు రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. అలాగే కొన్ని గ్రామా లకు రోడ్డు పనులు ప్రారంభించి, దాదాపు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి నలభైరోజులు అయినా రహదారుల పెండింగ్ పనుల విషయంలో ఎటువంటి ముందడుగూ పడలేదు. వేపాడ మండలంలోని సోంపురం–ఆనందపురం ప్రధాన రహదారి విస్తరణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్‌డీబీ నిధులు రూ.37 కోట్లు మంజూరు చేసింది. ఈనిధులతో దాదాపు 90 శాతం పనులను ఎన్నికలకు ముందే పూర్తి చేశారు. మిగతా 10 శాతంపెండింగ్ పనులు పూర్తి చేయించాలని వేపాడ మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే వేపాడ మండలంలో మారిక, ఎస్.కోట మండలంలో దబ్బ గుంట–పల్లపుదుంగాడ గిరిజన గ్రామాల బీటీరోడ్డు పనులు కూడా మధ్యలో నిలిచిపోయాయి. బొడ్డవర–చిట్టంపాడు గిరిజన గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు చేశారు. నిలిచిపోయిన పనులను పూర్తి చేసి, డోలీమోతలు, చావులు లేకుండా చూడాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

నియోజకవర్గంలో ఉన్న జిందాల్, పతంజలి భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. చిలకలగెడ్డపై మినీరిజర్వాయర్ నిర్మాణం దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమైందని, నిధులు మంజూరు చేసి పనులు పూర్తిచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎస్.కోట, కొత్తవలసలో టీటీడీ కల్యాణ మండపాలు ఏర్పాటు చేయాలని, ఎస్.కోట ఏరియా ఆస్పత్రిని సత్వరం పూర్తిచేసి వైద్యసేవలు అందివ్వాలని, బొడ్డవరలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. జామి–అలమండ రోడ్డులో కాజ్‌వే ఏర్పాటు, జామిలో రైతుబజార్ ఏర్పాటు హామీలు నెరవేర్చాలనే డిమాండ్ ఉంది. ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్‌కు విశాఖ నుంచి సిటీ సర్వీసులను పొడిగించి ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగు పరచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. తాటి పూడి తాగునీరు ప్రాజెక్టు పూర్తిచేసి రక్షిత తాగునీరు ఇవ్వాలని ప్రజలు, రైవాడ కాలువ నుంచి సాగునీరు ఇవ్వాలని రైతాంగం కోరుతోంది.



విస్తరణ పనులు మధ్యలో నిలిచి పోయిన వేపాడ మండల ప్రధాన రహదారి ఇదే

రోడ్డు పనులు పూర్తి చేయండి



గత ప్రభుత్వ హయాంలో వేపాడ మండలంలో మారిక, ఎస్.కోట మండలంలో దబ్బగుంట–పల్లపుదుంగాడ గిరిజన గ్రామాలకు బీటీ రోడ్ల పనులను ప్రారంభించారు.అయితే ఆ పనులు మధ్యలో నిలిచిపోయాయి. బొడ్డవర–చిట్టంపాడు గిరిజన గ్రామాల రోడ్డు ప్రతిపాదనల దశలో ఉంది. రోడ్ల నిర్మాణం పూర్తి చేసి, డోలీ మోతలు, చావులు లేకుండా చూడాలి. గిరిజనుల కోసం బొడ్డవరలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి. అంబులెన్స్ అందుబాటులో ఉంచాలి.

– జి.గౌరీష్, ఆదివాసీ గిరిజన సంఘనేత

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా ఆవశ్యకతను వివరిస్తున్న యోగా గురువు మూర్తి

బొండపల్లి: రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని యోగా గురువు జి.ఎస్. ఎస్.మూర్తి తెలిపారు. యోగా ఆవశ్యకత, సాధనపై ఫిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో గొట్లాం గ్రామంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రస్తుత సమా జంలో ఉరుకులు, పరుగుల జీవితంలో చాలా మంది తీవ్రమానసిక ఒత్తడికి లోనవుతున్నారని, క్రమం తప్పకుండా యో గా చేయడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని చెప్పారు. అలాగే ధ్యానం చేయడం ద్వారా కూడా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఫిరమి డ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణపై స్పందించిన యంత్రాంగం

- కర్లాంలో సర్వే నిర్వహించిన అధికారులు
- నివేదిక జాయింట్ కలెక్టర్‌కు సమర్పించనున్న సర్వే బృందం

సాక్షి ఎఫెక్ట్...

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో గెడ్డ ఆక్రమణపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. 'ఎర్రిగెడ్డ 'రామా'ర్పణం' అనే శీర్షికన ఈనెల 21న సాక్షి పత్రికలో కథనం వెలువడింది. ఈ కథనానికి స్పందించిన జిల్లా జాయింట్ కలెక్టర్(జేసీ) కె.కార్తీక్ ఆక్రమణపై సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆక్రమణపై పూర్తిస్థాయి సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని జేసీ ఆదేశించిన సంగతి విదితమే. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే యంత్రాంగం సోమవా రం కర్లాం గ్రామానికి వెళ్లి గెడ్డ ఆక్రమణపై సర్వే చేశారు. ఎర్రిగెడ్డ ఎంత పొడవు, వెడల్పు ఉంది. ఎంత మేర ఆక్రమణలు జరిగాయి. ఆక్రమించిన వారిలో ఎవరెవరు ఉన్నారు అనే కోణంలో అధికారులు సర్వే జరిపారు. పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసి జాయింట్ కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.



కర్లాంలో ఎర్రిగెడ్డ ఆక్రమణపై సర్వే చేస్తున్న సర్వే, రెవెన్యూ యంత్రాంగం

స్టూడెంట్ కిట్ల పంపిణీ



చింతపల్లిపేటలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీదేవి



భూపాలపురంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: మండలంలోని భూపాలపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సోమవా రం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. అలాగే చింతపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ జమ్ము శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము అప్పలనాయుడు విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేశారు.

టీఎల్‌ఎంతో బోధన సులభతరం

వేపాడ: టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)తో విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యే బోధన చేయవచ్చని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. జాతీయ నూతన విద్యా విధానం –2020 నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు శిక్ష సప్తాహ (విద్యావారం) అనే కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మొదటి రోజు విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేవిధంగా బొమ్మలతో బోధన చేశారు. 23న ఎఫ్‌ఎల్‌ఎన్ డే, 24న స్పోర్ట్స్‌డే, 25న కల్చరల్ డే, 26న స్కిలింగ్‌డే (టెక్నాలజీ ఇన్ ఎడ్యుకేషన్ దివాస్), 27న ఇకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ డే, 28న కమ్యూనిటీ ఇన్‌వాల్వ్‌మెంట్ డే నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.



దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలలో బొమ్మలద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తచట్టాలపై అవగాహన కల్పించండి



పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బొండపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త రక్షణ చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ సిబ్బందికి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఆయన తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడారు. తరచూ జీతీయ రహదారి–26తో పాటు,రహదారులపై ప్రమా దాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసు కోవాలని చెప్పారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ ఎన్.వి.ప్రభాకరరావు,స్పెషల్ బ్రాంచ్ సీఐ కె.కె.వి.విజయనాథ్, ఎస్ఐ కె.లక్ష్మణరావు తదితరు లు ఉన్నారు.

వరి నారుమడుల పరిశీలన



వి. కృష్ణాపురంలో వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

దత్తిరాజేరు: వరి నారుమడులు, పత్తి పంట పొలాల్లో వరద నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజయనగరం ఏరువాక కేం ద్రం శాస్త్రవేత్తలు లక్ష్మణరావు, శ్రీనివాస్ రైతులకు సూచించారు. మండలంలోని వి.కృష్ణాపురం, మరడాం గ్రామా ల్లో వరి నారుమడులు, పత్తిపంటను సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలను పాటించా ల ని చెప్పారు. ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. గజపతినగరం ఏడీఏ మహరాజన్, ఏఈఓ లీలాకృష్ణ, వీఏఏ కృష్ణవేణి పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ సాగుతో అధిక దిగుబడి



వసాదిలో డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలు వేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

గంట్యాడ: డ్రమ్ సీడర్ విధానంలో వరి సాగు చేయడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అదనపు డీపీఎం స్వామినాయుడు అన్నారు. మండలంలోని వసాది, కొత్తవెలగాడ గ్రామాల్లో సోమవారం ప్రకృతి వ్యవసా య విధానంలో డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలు వేస్తున్న విధానాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్ సీడర్ ద్వారా విత్తనాలు విత్తుకోవడం వల్ల విత్తనం తగిన మోతాదులో పడుతుందని, కలుపును నివారించవచ్చని, కూలీల ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎర్నిబాబు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రగతి దేశ అభివృద్ధికి కొలమానం



విద్యా సామగ్రి అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ, తదితరులు

- గంట్యాడ ఎంఈఓ విజయకుమారి

విజయనగరం: విద్యా ప్రగతి దేశ అభివృద్ధికి కొలమానమని గంట్యాడ మండల విద్యాశాఖాధికారి విజయకుమారి అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఉడా కాలనీ ఈవినింగ్ వాకర్స్ క్లబ్‌లో ప్రతినిధులు సమకూర్చిన నోట్ పుస్తకాలు, స్టీలు కంచాలు, గ్లాసులు, విద్యాసామగ్రిని గంట్యాడ మండలం జగ్గాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వచ్ఛంద సంస్థలు విద్యా ప్రగతికి చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు సత్ఫలితాలను అందిస్తాయన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈవినింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జామి అప్పలసూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు కొత్తలి ఎర్రినాయుడు, ఈవినింగ్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి టి.చిన్నారావు, డిప్యూటీ గవర్నర్ టి.చిరంజీవిరావు, ఎం.జనార్దనరావు, జగ్గాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు బి. లక్ష్మి, ఇ. గురునాథ్, సర్పంచ్ కొండపల్లి రాంబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట: స్థానిక స్పార్టన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులతో పాటు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఆగస్టులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మండల విద్యార్థులు సత్తాచాటారు. స్పార్టన్ అకాడమీ కోచ్ మళ్ల ప్రసాద్ సోమవారం మాట్లాడుతూ తమ అకాడమీ నుంచి అండర్–11 బాలుర విభా గంలో జి.హర్ష ప్రథమ స్థానం, డబుల్స్‌లో యశోవర్ధన్–చార్విక్ ప్రథమ స్థానం, అండర్–15 బాలికల విభాగం డబుల్స్‌లో ఎస్.లాస్య ప్రథమస్థానం, అండర్–17లో ద్వితీయ, అండర్– 17 బాలుర సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఎం.రోహిత్ ప్రథమస్థానం సాధించారని చెప్పారు. అండర్–19 ఉమెన్స్ విభాగంలో జె.శ్రియాదేవి, పురుషుల విభాగంలో డి.మనోహర్ ద్వితీయ స్థానాలు సాధించారని, వీరంతా త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లనున్నారని చెప్పారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వీరిని స్టేడియం వ్యవస్థాపకులు డి.వి.సూర్యనారాయణ, జె.విజయరామరాజు, బి.ఈశ్వరరావు, కె.రాము, అసిస్టెంట్ కోచ్ ఆర్.మోహన్ అభినందించారు.



జిల్లాస్థాయి పోటీలో గెలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన స్పార్టన్ అసోసియేషన్ క్రీడాకారులు

అలాగే జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్.కోటలోని డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థిని లాస్య అండర్–15 డబుల్స్‌లో విన్నర్‌గా, అండర్–17 సింగిల్స్‌లో రన్నర్‌గా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ వై.జానకీదేవి తెలిపారు. ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని అల్లాడ కాత్యాయిని ఉమెన్ డబుల్స్‌లో ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పి.శ్రీరాములు తెలిపారు. ఆగస్టులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తుందని ఆయన అన్నారు.